వర్షాలు కురవాలని దేవున్ని పూజించండి: మంత్రి పొన్నం





# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 19 అక్టోబరు, 2026 | పేజీలు : 06


# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





రంగురంగుల పూలతో
బతుకమ్మలు పేర్చి బతుకమ్మ
ఆటతో అలరించిన మహిళలు
ఆడపడుచుల ఆత్మ గౌరవానికి
ప్రతీకగా జరుపుకునే అద్భుతమైన
పూల పండుగ
పూలను పూజించే సాంప్రదాయం
తెలంగాణలోనే!





### బతుకమ్మ, దసరా పండుగలను
## ప్రశాంతంగా జరుపుకోవాలి

**మహిళల భద్రతకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు: డిసిపి భూక్య రాంరెడ్డి**

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు. పండుగల సందర్భంగా మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పెద్దపల్లి పట్టణంలోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ భూక్య రాంరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పట్టణ ప్రజలకు ముందస్తు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.బతుకమ్మ సంబరాల సమయంలో మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా,అమర్యాదగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బందులు కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అదేవిధంగా బతుకమ్మ ఆడుకునే సమయంలో మహిళలు చైన్ స్నాచింగ్ వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ బతుకమ్మ,దసరా పండుగలను ఆనందంగా,సురక్షితంగా జరుపుకోవాలని డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు.



## అమ్మవారికి ఎమ్మెల్యే దంపతుల పూజలు

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలి ఠాకూర్ దంపతులు గోదావరిఖని పట్టణంలోని లెనిన్ నగర్, రామగుండం పట్టణంలోని ఎపవర్‌హౌస్ ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా దుర్గాభవాని అమ్మవారి మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. పండుగల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ అయోధ్య సింగ్, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఎండి.ముస్తాఫా, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# అధిక ధరలకు మాంసం అమ్మకాలు

**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలంలో మటన్,చికెన్ దుకాణాల వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి దసరా పండుగ వచ్చిందని ఆదివారం నుండి మటన్ చికెన్ దుకాణాల వ్యాపారులు కిలో మటన్ ధర 900రూపాయలు, చికెన్ కిలో300 రూపాయలు బోర్డులు పెట్టి మరి అధిక ధరలకు అమ్మకాలు చేస్తు న్నారు.సెంటినరీకాలనీ సింగరేణి ప్రాంతం కావడంతో సింగరేణి కార్మికుల ప్రజల నుండి వ్యాపారులు దసరా పండుగ ఆసరా చేసుకుని దండుకుంటున్నారు.దసరా పండుగ కావడంతో కచ్చితంగా చికెన్ మాటను ప్రజలు కొనుగోలు చేస్తారు కాబట్టి వారికి అవసరాలను ఆసరా చేసుకుని అధిక ధరలకు వ్యాపారస్తులు చికెన్ మటన్ అమ్మకాలు జరుపుతున్నారు.ఫుడ్ సేఫ్టీ సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



**మటన్ వ్యాపారస్తుల మోసాలు :** రోగాల బారిన పాడిన గొర్రెలను కోసి విక్రయిస్తుంటారు దీనికి సంబంధించిన పశువుల వైద్యుడు వచ్చి స్టాంపు వేసిన తర్వాతనే మేకలను గొర్రెలను కోయాలి కానీ ఇక్కడ పశువుల వైద్యుడు పర్యవేక్షించచడు చనిపోయే గొర్రెలను కోసి అమ్మకాలు చేస్తుంటారు చూడడానికి దుకాణం ఎదురుగా గొలుసులకు మేకపోతులను పెట్టి అమ్మకాలు చేసేది మాత్రం గొర్రె మాంసం ఇది ఇక్కడ సెంటనరీ కాలనీలో కథ కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న దందా ఏ ఒక్క పశు వైద్యుడు వచ్చి మాంస దుకాణదారుల దగ్గరికి వచ్చి పర్యవేక్షించారు సంబంధిత అధికారులు మాంస దుకాణ లను వద్దకు వచ్చి పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## నెట్‌బాల్ పోటీలకు యూనివర్సల్ విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని రైజింగ్ సన్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపికల్లో యూనివర్సల్ స్కూల్‌కు చెందిన వై.యశ్వంత్ సాయి, బీరు కుమార్,టి. అభినయ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో నల్గొండ జిల్లాలోని టైమ్స్ స్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కల్వల సంతోష్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్,ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ విద్యార్థులను అభినందించి,రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదిన వేడుకలను మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆదివారం పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ, ఉద్యమ నేత యువ కిశోరం మాజీ ప్రభుత్వ విప్పు చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ రానున్న రోజుల్లో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ రానున్న రోజుల్లో తిరిగి అధికారం చేపట్టి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు, రాష్ట్రంలో తన సేవలను కొనసాగించాలని తిరిగి బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు కెసిఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారం చేజిక్కించుకుంటుందని యువ నేత కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రజలందరూ తిరిగి బి.ఆర్.ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు,బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, కన్వీనర్ బోయిని రాజ మల్లయ్య,నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్,తిప్పారపు దయాకర్, గుడిపాటి శ్రీనివాసరెడ్డి,గందె మల్లికార్జున్, అనుమాల బాపూరావు, సతీష్, వహీద్, మహేష్, మోయిజ్, సమీర్, కార్తీక్, మనీ లతోపాటు పరుగులు పాల్గొన్నారు.

## కరువుపై అధ్యయనమే ప్రజాయాత్ర లక్ష్యం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రైతులకు భరోసా కల్పిస్తూ కరువు పరిస్థితులపై అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి నివేదించడమే ప్రజాయాత్ర లక్ష్యమని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ తెలిపారు. పెద్దపల్లి కమాన్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ వరకు రాష్ట్రవ్యాప్తంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోయారని,రానున్న రోజుల్లో కరువు తీవ్రత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.నీటి లభ్యతను బట్టి వరికి బదులు కంది, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.గ్రామాల్లో కళాకారుల బృందాలతో ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు.అసైన్డ్ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా,మూడేళ్లుగా నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో అసైన్డ్ భూముల సమస్య కొనసాగుతోందని, సుద్దాల గ్రామంలో విద్యుత్తు లేక రైతులు డీజిల్ ఇంజిన్లతో సాగు చేస్తున్నారని తెలిపారు. ఎదులాపురంలో వరి పంటలు ఎండిపోవడాన్ని గుర్తించామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో ఫౌండేషన్ సిబ్బంది, కళాకారులు గుగ్గిళ్ల ఎల్లన్న,కడారి శ్రీనివాస్,మేడ స్వామి,యాకుబ్,తదితరులు పాల్గొన్నారు.



## ఎత్తిపోతలు పూర్తి చేసిన ఘనత ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌దే

**ప్రజాపక్షం/అంతర్గాం :** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం అన్నారు. మూర్మూర్, కుక్కలగూడూర్ బండలవాగు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.2018 ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్ బకాయిలు ఇప్పించి పనులు పూర్తి చేయించారని రాజలింగం తెలిపారు. ట్రయల్ రన్ నిర్వహించి పంటలకు నీరందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మద్ది తిరుపతి గౌడ్, సర్పంచులు కొలిపాక చంద్రారెడ్డి,గాదె సుధాకర్, అంగోత్ రవి నాయక్,మాజీ ఎంపీపీ పవన్, కాంగ్రెస్ నాయకులు మగ్గిడి రాకేశ్ కుమార్, నక్క రాజ్‌కుమార్, బోడకుంట సంతోష్, ఎం.డి.జలీల్, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ గ్రామాన అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు!

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి.తొమ్మిది రోజుల పాటు సాగిన పూల జాతర ముగింపు వేడుకైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ముత్తారంలోని అన్ని గ్రామాలు ముస్తాబయ్యాయి.ఆయా గ్రామాల సర్పంచులు ఆధ్వర్యంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ వర్గాలు విస్తృత ఏర్పాట్లు చేశాయి.గునుగు, తంగేడు, బంతి, చామంతి వంటి రంగురంగుల ఔషధ గుణాలున్న ప్రకృతి పూలతో మహిళలు బతుకమ్మలను గోపురాకృతిలో పేర్చి, వాటిపై పసుపు గౌరమ్మను ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో కొలిచారు.



**మార్మోగిన పురవీధులు :** సాయంత్రం వేళల్లో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయ ప్రాంగణాలు, చెరువు గట్ల వద్ద మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఒకచోట చేరారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో, తెలంగాణ జానపద గేయాలతో ఆడిపాడారు. ఆడపడుచుల కోలాటాలు, చప్పట్ల చప్పుళ్లతో పురవీధులన్నీ మార్మోగాయి.

**భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనం :** కోలాటాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్ళి,ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అంతకుముందు గౌరమ్మకు ప్రత్యేకంగా తయారు చేసిన సద్దుల (మలీద ముద్దలు, నువ్వులు, పల్లీల పిండి) ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి,మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకున్నారు.మండల వ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా,మహిళలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్థానిక యంత్రాంగం, పోలీస్ సిబ్బంది అన్ని చోట్లా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ముత్తారం చరిత్రలోనే ఈ ఏడాది సద్దుల బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, భక్తిభావంతో ముగిశాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సంస్కృతి సంప్రదాయలకు ప్రతీకగా తెలంగాణలో పూలను పూజించే బతుకమ్మ పండుగ ఆనవాయితీగా వస్తుంది. సద్దుల బతుకమ్మ రోజున తీరొక్క పూలతో (తంగేడు, గునుగు, పట్టు కుట్టులు, బంతి, చామంతి) లాంటి రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి సంబరాలను సిరిసిల్ల పట్టణంలో ఆడపడుచులు సాంప్రదాయ దుస్తులు ధరించి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ ఒక లయతో అడుగులు వేస్తూ వలయంగా తిరుగుతూ మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక జీవనానికి, ప్రకృతి ఆరాధనకు, ఆడపడుచుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా జరుపుకునే అద్భుతమైన పూల పండుగగా కొలుస్తారు. మహాలయ అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మతో మొదలయ్యే ఈ వేడుకలు తొమ్మిది రోజుల పాటు సాగి దుర్గాష్టమినాడు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలి పువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇలా దేని ప్రత్యేకత దానిదే తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఆడి నీటిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, విప్ బుర్ర మల్లిఖార్జున్, కౌన్సిలర్ సభ్యులు వేముల రాములు, నాగరాజు, వెంకటేశం, రిక్కమల్లె రజిత సంపత్, బూర బాలు, దార్నం అరుణ లక్ష్మీనారాయణ, లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, మంచే రేణుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరంలో

**ప్రజాపక్షం/గన్నేరువరం:** మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలతో గన్నేరువరం మండల కేంద్రంలో పండుగ శోభ సంతరించుకుంది.

## దుర్గాదేవి మంటపాల్లో సునీల్ రెడ్డి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపాల్లో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం,హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవార్లను,అలాగే కేశంపల్లి గ్రామంలో కొలువుదీరిన దుర్గాదేవి మండపాలను ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ జగన్మాతను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల శాఖ అధ్యక్షుడు పేయ్యాల కుమార్,పలువురు పార్టీ నాయకులు మరియు అమ్మవారి భక్తులు అధిక పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు.వేడుకలకు వచ్చే మహిళలు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. పరిసరాలను సిద్ధం చేస్తూ వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు.గ్రామ సర్పంచ్ సూదాటి రవీందర్‌రావు ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు.మహిళలు బతుకమ్మలను పేర్చి,ఆటపాటలతో వేడుకల్లో పాల్గొనేలా ఏర్పాట్లు కొనసాగాయి.

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే క్రీడలు

ఎస్ ఐ జి. నవీన్ కుమార్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** యువతలు కూడా పెంపొందించేందుకే క్రీడలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ జి.నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని ధర్మసాగర్ కాలనీ స్టేడియంలో నిర్వహించిన ఇబ్రహీంపట్నం పోలీస్ క్రికెట్ లీగ్ ఫైనల్‌లో తిమ్మాపూర్ జట్టు విజేతగా, వర్షకొండ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేత తిమ్మాపూర్ జట్టుకు రూ.10వేలు, రన్నరప్ వర్షకొండ జట్టుకు రూ.5వేల నగ దు బహుమతులను ఎస్సై జి.నవీన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విజేత జట్టుల క్రీడాకారులను ఎస్ఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం



**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన ఇటీవల జాతీయ స్థాయిలో మహిళా కిసాన్ దివాస్ 2026 ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న బండారి విజయ, వెంకటేష్ దంపతులను గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం పాలక వర్గం, కుల సంఘాల పెద్ద మనుషులు, గ్రామస్థులు యువకుల ఆధ్వర్యంలో సర్పంచ్ కొలపాక రాధ రాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైదం ప్రభాకర్, వార్డు సభ్యులు తేలు విజయ, మంగళపల్లి లచ్చం, తోట మల్లయ్య, పత్రి లక్ష్మి రాజేందర్, బొడ్డుపల్లి రాజేష్, పంచాయతీ కార్యదర్శి గనవేని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో మూడు గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రాపల్లి సురేష్–మంజుల దంపతులు తమ సొంత నిధులతో వర్షకొండలోని భరతమాత విగ్రహం వద్ద, కేశాపూర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద, ఇబ్రహీంపట్నంలో వడ్డేపల్లి భూమయ్య ఇంటి సమీపంలో మూడు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో లైట్‌కు రూ.45 వేల చొప్పున మొత్తం రూ.1.35 లక్షలు వెచ్చించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోన్‌కంటి చిన్న వెంకట్, ఆయా గ్రామాల సర్పంచులు, బిజెపి నాయకులు తీగల శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక దందా



**ప్రజాపక్షం/మల్లాపూర్:** ఇటీవలేమల్లాపూర్ మండల వ్యాప్తంగా గోదావరి వాగుల నుండి అక్రమ ఇసుక రవాణా యదేచ్ఛగా కొనసాగుతూ జోరు అందుకుంది. గోదావరి తీర ప్రాంతాలైన సంగెం శ్రీరాంపూర్, కొత్తధామ రాజుపల్లి,వాల్గోండా గ్రామాల నుండి నిత్యం వందలాది సంఖ్యల ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా జరుగుతూ కొందరి అధికారులు జేబులను నింపుతుంది. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా నడిచే ట్రాక్టర్లు రోడ్డు ఎక్కుతున్న మామూళ్ల మత్తులో అధికారులు తుగిపోతూ పట్టించుకోవడం లేదు. కాగా ఇదే అదునుగా భావించిన వాల్గొండ గ్రామంలో అక్రమంగా నడిచే ఇసుక రవాణాకు కొందరు బహిరంగ అక్రమ వేలం పాట చేపట్టగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి మూడు లక్షల రూపాయలకు పైగా చెల్లించి టెండర్ దక్కించుకోవడం అధికారుల పనితీరుకు నిదర్శంగా నిలుస్తుంది. అసలే భూగర్భజలలు అడుగంటి పోతున్న తరుణంలో, ఇలాంటి అక్రమ వేలాలు అరికట్టాల్సిన అధికారులు ప్రోత్సహిస్తూ ఉండడంతో ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇప్పటికైనా రెవెన్యూ పోలీస్ అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణానను అడ్డుకుంటారని ఆశిద్దాం మరి.

# యువత క్రీడారంగంలో ముందు ఉండాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/బీర్పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం లోని కొల్వాయి గ్రామంలో బీర్పూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 11 క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ముగింపు కార్యక్రమానికి హాజరై విన్నర్ టీమ్ లగాన్‌రన్నర్ టీమ్ లెజెండ్స్ లకు బహుమతులు ప్రదానం చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. మకొల్వాయి గ్రామంలో రైతుల వినతి మేరకు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ చొరవ తో ఏర్పాటు చేసిన 100కెవి డిటిఅర్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ చిన్న కొల్వాయి గ్రామంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్ ప్రాంతాన్ని స్తానిక నాయకులతో కలసి పరిశీలించారు. భక్తులకు రవాణ సౌకర్యం, విద్యుత్, పారిశుధ్యం తో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ రావు ,సర్పంచులు రంగు లక్ష్మ ణ్, ఇస్రా, శేఖర్,మారుతి, శ్రీనివాస్, సురేందర్, సృజన సుషీన్, హరీష్, సాగర్, రామచంద్రం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపాక రమేష్ నాయకులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు బుచ్చన్న అనిల్,రామచంద్రం గౌడ్,గంగాధర్, యేసు, తిరుపతి, సతీష్ ,రవి, రమేష్, ఎఇ శ్రీనివాస్ నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మి పూజ తర్వాతే ఆకులు.. సంప్రదాయాన్ని కాపాడుదాం!



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం దసరా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి సందర్భంగా స్వామివారి ప్రదక్షిణ, జమ్మి గద్దె వద్ద పూజల అనంతరం జమ్మి ఆకులను బంగారంగా భావించి ఇచ్చిపుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకోవడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. అయితే కొందరు భక్తులు స్వామివారి ప్రదక్షిణ పూర్తికాకముందే, జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించకముందే ఆకులను తెంపుకోవడం విచారకరం. ఈ విధానానికి స్వస్తి పలికి సంప్రదాయాన్ని గౌరవించాలని పలువురు కోరుతున్నారు.

జమ్మి చెట్టు విశిష్టత ఏమిటంటే ? మహాభారత కథనం ప్రకారం పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచిపెట్టారనే విశ్వాసం ఉంది. విజయదశమి రోజున జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించడం, బంధుమిత్రులకు పంచడం శుభానికి, విజయానికి,పరస్పర ప్రేమాభిమానాలకు ప్రతీకగా భావిస్తారు. అందుకే జమ్మి ఆకుల కోసం తొందరపడకుండా, పూజ పూర్తయ్యాకే ఆకులను స్వీకరించాలి. చెట్టుకు నష్టం కలగకుండా, తోపులాటలకు తావివ్వకుండా భక్తులు సహకరించాలి.

**భక్తి అంటే క్రమశిక్షణ:** స్వామివారి ప్రదక్షిణ అనంతరం స్థానిక ఆచారం ప్రకారం పురోహితుల ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, ఆ తర్వాత జమ్మి ఆకులను పంచుకోవాలి.దసరా అంటే చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. జమ్మి ఆకులను బంగారంగా భావించే మనం,మన సంప్రదాయాలను కూడా అంతే విలువైనవిగా భావించాలి. ఆకుల కోసం తొందర పడకుండా పూజకు ముందు హడావుడి చేయకుండా సంప్రదాయానికి ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలి. వేడుకల్లో క్రమశిక్షణే మన బాధ్యతగా భావించాలి. ప్రతి గ్రామంలో దసరా పండుగ ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రతి ఒక్కరం కోరుకుందాం.

# అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు, చిన్నారులు అత్యంత అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

**పల్లెల్లో పండుగ వాతావరణం:** పండుగ పురస్కరించుకుని ఉదయం నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. అత్తగారింటి నుంచి పుట్టింటికి చేరిన ఆడబిడ్డలు పొద్దుపొడవక ముందే ఇల్లు వాకిలి సర్దుకుని, నూతన పట్టు వస్త్రాలు ధరించి పండుగకు సిద్ధమయ్యారు. తమ అన్నదమ్ములు తీసుకువచ్చిన గునుగు,తంగేడు, బంతి, చామంతి వంటి తీరొక్క రంగురంగుల పూలను సేకరించి పెద్ద సైజులో ఆకట్టుకునేలా బతుకమ్మలను పేర్చారు.

**మారుమోగిన ఆటపాటలు, కోలాటాలు:** సాయంత్రం వేళ మహిళలంతా తాము తయారుచేసిన బతుకమ్మలతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లకు చేరుకున్నారు. బ్రతుకమ్మలను మధ్యలో ఉంచి, వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ" బతుకమ్మ ఉయ్యాలో.... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ సాంప్రదాయ గీతాలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై, తొమ్మిది రోజుల పాటు చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంట్లో ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలు సాగాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ముగింపు వేడుకల్లో మండల వ్యాప్తంగా మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 9 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.అనంతరంశస్త్రచికిత్సలు చేయించుకున్న నిరుపేదలకు ఉచితంగా కంటి అద్దాలు, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, డాక్టర్ విజయ్, ఆసుపత్రి సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ జన్మదినం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలను మండల బిఆర్ఎస్ నాయకులు హంగు ఆర్భాటాలు లేకుండా సేవా కార్యక్రమాలతొ ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాఘవపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి వేడుకలను జరిపించారు. అదేవిధంగా రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ ఆధ్వర్యంలో ఇటిక్యాల నివేదిత ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించి ఆయన మరిన్ని పుట్టినరోజు వేడుక జరుపుకొని ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాలలో బిఆర్ఎస్ నాయకులు రంగురామా గౌడ్,బైరీ రవికుమార్ యాదవ్, తోట సంతోష్, రాజ్ కుమార్,ఇరు గ్రామాల పలువురు, వార్డు సభ్యులు బిఆర్ఎస్ నాయకులు, తదితరున్నారు.

## దసరా వేడుకలకు మహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయం వద్ద దసరా వేడుకల కోసం సర్పంచ్ బద్దం గోపి ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. జంబి గద్దె పరిసరాలను శుభ్రం చేయించి, గుంతల్లో క్రషర్ డస్ట్ పోయించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో అలిశెట్టి మోహన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడిలోకి..గౌరమ్మ



**ప్రజాపక్షం/మల్యాల:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే సద్దుల బతుక మ్మ వేడుకలు ఆదివా రం రాత్రి జగిత్యాల జిల్లా మల్యాల మండ లం లో గ్రామాల్లో అంబరాన్నంటాయి.ఎనిమిది రోజుల పాటు చిన్న బతుకమ్మలతో ఆడిపాడిన మహిళలు తొమ్మిది రోజు పెద్ద బతుకమ్మలను రంగు రంగుల పూలను సేకరించి పేర్చారు. అనంతరం స్థానికంగా వరద కాల్వలో బతుకమ్మ నిమజ్జనం చేశారు. నిమజ్జనం ఏర్పాట్లను ఆయా గ్రామాల సర్పంచ్లు పర్యవేక్షించారు.

# పలువురికి డాక్టర్ రఘు పరామర్శ



ప్రజాపక్షం/మల్లాపూర్: మండలంలోని వివి రావు పేట గ్రామంలో తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రఘు శనివారం రాత్రి పలువురిని పరామర్శించారు.వేంపల్లి గ్రామంలో మాజీ జెడ్పిటిసి నానం రాజారెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బిజెపి నాయకుడు ముత్యల శ్రీహరిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులకు మన ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

# శ్రీ దుర్గాదేవిగా జగన్మాత దివ్య దర్శనం

ప్రజాపక్షం/గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీమ్‌రాజుపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో 'శ్రీ దుర్గాభవాని సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయ పరిసరాలు భక్తిప్రపత్తులతో మార్మోగాయి. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యాచార్యుల పర్యవేక్షణలో సప్తశతీ పారాయణం, దుర్గాసూక్త హవనం, వాగ్దేవీ హవనం మరియు మూలమంత్ర క్రతువులు శాస్త్రోక్తంగా జరిగాయి. కరెన్సీ నోట్లు, సంప్రదాయ ఎరుపు రంగు పట్టుచీరతో సర్వాంగసుందరంగా అలంకరించిన అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే బారులుతీరారు. ఈ పూజా కార్యక్రమాల్లో సేవా సమితి వ్యవస్థాపకులు, ఆలయ చైర్మన్ బొమ్మన కుమార్, గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భవానీ దీక్షాధారులు, గ్రామ ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పగుళ్లు ఏర్పడిన విద్యుత్ స్తంభం



ప్రజాపక్షం/పెంబి: గ్రామంలోని కొత్తగూడెం కాలనీలో విద్యుత్ స్తంభానికి పగుళ్లు ఏర్పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనని భయపడుతున్నారు. స్తంభం కూలితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని పరిశీలించి, ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# రాజన్న ఆలయ గోశాలలో ప్రత్యక్షమైన నాగుపాములు



ప్రజా పక్షం/వేములవాడ: వేములవాడ పట్టణంలోని తిప్పాపురం రాజన్న ఆలయ గోశాలలో నాగుపాము కనిపించడంతో సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఆదివారం గోశాలలో సంచరిస్తున్న పామును గమనించిన సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ వెంటనే పట్టణానికి చెందిన స్నేక్ క్యాచర్ మాదాసు జగదీష్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జగదీష్ తక్షణమే అక్కడికి చేరుకుని, గోశాలలోని కోడెలకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాకచక్యంగా నాగుపామును బంధించారు. ఆ తర్వాత దాన్ని సురక్షితమైన నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెట్టారు. అనంతరం స్థానిక వేద పాఠశాలలో కోడె నాగుపాము ఉన్నట్లు సమాచారం రావడంతో జగదీష్ వెంటనే అక్కడకు వెళ్లారు. పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తున్న కోడె నాగును కూడా అప్రమత్తంగా పట్టుకుని, సురక్షితంగా విడిచిపెట్టారు. సమయానుకూలంగా స్పందించి ప్రమాదకర పాములను పట్టుకోవడంతో గోశాల సిబ్బంది, వేద పాఠశాల విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా పాములను పట్టుకుని ప్రజల ప్రాణాలు కాపాడుతున్న జగదీష్ ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



ప్రజాపక్షం/మల్లాపూర్: దేవి అమ్మవారి ఆశీస్సులతో మండల ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ వెలమా కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు అన్నారు. ఈ మేరకు మల్లాపూర్ రత్నాపూర్ కొత్త దామరాజు పల్లి గ్రామాలలో ఆదివారం పర్యటించారు.మండల కేంద్రంలో నవదుర్గ సేవ సమితి, కనకదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొత్తదామరాజు పల్లి గ్రామంలో దుర్గాదేవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న పుష్కర ఘాటును పరిశీలించి, నిర్మాణంలో ఉన్న శ్రీ చక్ర ఆలయాన్ని సందర్శించి నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామం నుండి పుష్కర ఘాట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకి కృషి చేస్తానని గ్రామసభ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు ఏగ్యరపు లింబాద్రి, గోండ రాజేందర్, రొండ్ల రాజేశ్వరి రాజారెడ్డి,కసుముల వెంకటేష్, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా బతుకమ్మ పండుగ



ప్రజాపక్షం/వేములవాడ: తెలంగాణ రాష్ట్ర పూల పండుగ. బతుకమ్మ పండుగ ఇది ప్రకృతిని, స్త్రీ శక్తికి ప్రతీక. వ్యవసాయాన్ని గౌరవిస్తూ తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ. ఆశ్వీయుజ మాసం మహాలయ అమావాస్య (పెత్రమాస) రోజున ప్రారంభమై దుర్గాష్టమి/సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు జరుపుకునే ప్రకృతి పూల అమరిక బతుకమ్మ. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో గౌరీదేవిలా బతుకమ్మను రంగు రంగుల పువ్వులతో అమర్చుతారు. ప్రతిరోజూ ఒక్కో రకమైన ప్రత్యేక నైవేద్యం (సద్దులు) తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. తొమ్మిది రోజులు బతుకమ్మను వివిధ పేర్లతో



కొలుస్తారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్న ముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ, పెద్ద బతుకమ్మ చివరి రోజున మహిళలంతా కలిసి బతుకమ్మలను సమీపంలోని జలశయాల్లో నిమజ్జనం చేస్తారు

ప్రజాపక్షం/జగిత్యాల : తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆట పాటలు, కోలాటాలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు,యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతకమ్మ ఆటలాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... అంటూ బతుకమ్మను వైభవంగా సాగనంపారు. అనంతరం సమీప చెరువులు, కుంటల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు .మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకొని వెళ్లిరా బతుకమ్మ మళ్లీ రా అంటూ వేడుకొన్నారు. .బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగ అని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయి అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి,తదితరులు ఉన్నారు.

ప్రజాపక్షం/చందుర్తి : మండల వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆదివారం వేకువజామునే అన్నాదమ్ములు అక్కాచెల్లెల్ల బతుకమ్మల కోసం చేలు, చెలకలు, అడవి బాట పట్టి వివిధ రకాల పూలను సేకరించి తీసుకువచ్చారు. ఆడపడుచులు తీరొక్క రంగు పూల తో అందంగా బతుకమ్మలను పేర్చారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల పాలకవర్గాలు ,ప్రజాప్రతినిధులు ,నాయకులు, ప్రముఖులు , గ్రామ పెద్దలు, యువకులు , మహిళలు పెద్దత్తున పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శ



ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూర గ్రామానికి చెందిన గంగాధరి శ్రీకాంత్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం మస్కట్‌కు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట సర్పంచ్ దామెర రుశేంద్ర శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఏవరం గంగాధర్, బిట్ల మహేష్, పతువుల దేవయ్య, జంగిలి మహేష్, ఇతడి రమేష్, సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి ఉన్నారు.

# వ్యవసాయ బావిలో మొసలి ప్రత్యక్షం



ప్రజాపక్షం/మల్లాపూర్: గోదావరి, వాగులలోని నీటిమడుగులలో నివసించే మొసలి వ్యవసాయ బావిలో ప్రత్యక్ష కావడంతో రైతులు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఓటబులాపూర్, ఓబులాపూర్ తండా గ్రామపంచాయితీల మధ్యగల ఓ చిన్నపాటి చెరువుని ఆనుకొని ఉన్న ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో అటుగా వెళ్ళిన రైతులకు కనబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. గోదావరి నది సమీపాన ఉండడంతో మొసలి వ్యవసాయ బావిలోకి వచ్చి ఉండొచ్చని, మొసలితో ప్రమాదం పొంచి ఉన్నందున తరలించాలని, సంబంధిత అధికారులు చొరవ చూపి మొసలిని బంధించి తరలించాలని ఇరు గ్రామాల కోరుతున్నారు.వ్యవసాయ బావిలో ఒక్కసారిగా మొసలి ప్రత్యక్షం కావడంతో రైతులు భయానికి లోనయ్యారు.



# బీర్పూర్ మండలంలో పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

### జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్

ప్రజాపక్షం/బీర్పూర్: జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని కొల్వాయి పాక్స్ చైర్మెన్ నవీన్ రావు గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ ఉండగా వారిని వారి స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. తుంగురు నాయకులు మిట్టపల్లి గంగన్న తల్లి అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ రావు, మండల సర్పంచ్ లు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా గుండి శంకర్ శర్మ

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.సంఘ భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉపాధ్యాయులు గుండి శంకర్ శర్మ,ప్రధాన కార్యదర్శిగా పురాణపు సాంబమూర్తి ఎన్నికయ్యారు. ప్రధాన ఎన్నికల అధికారిగా పానుగంటి దత్తాత్రి వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించారు.అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 468 ఓట్లకు గాను శంకర్ శర్మకు 265 ఓట్లు, ఐ.రామయ్యకు 196 ఓట్లు పోలయ్యాయి.దీంతో 69 ఓట్ల మెజారిటీతో శంకర్ శర్మ గెలిచినట్లు ప్రకటించారు.అదేవిధంగా ప్రధాన కార్యదర్శి కి పోటీపడ్డ పురాణపు సాంబమూర్తికి 300 ఓట్లు రాగా ప్రత్యర్థి మధు మహాదేవ్ కు 156 ఓట్లు వచ్చాయి.అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా బొజ్జ సంపత్ కుమార్ శర్మ, కోశాధికారిగా ఒజ్జల దేవీప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా శ్రీధర మహేష్ లు ఎన్నికయ్యారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని బ్రాహ్మణ సంఘం పెద్దలు, సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి,సంక్షేమానికి ధర్మపురి క్షేత్ర సంప్రదాయాల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఘనంగా విజయదశమి వేడుకలు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** హిందువులు ఐక్యంగా ఉంటేనే దేశ మనుగడ సాధ్యమని, హిందుత్వం అనేది ఒక మతం కాదని,అది ధార్మిక జీవన విధానమని డాక్టర్ కృష్ణంరాజు అన్నారు.నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్, శాస్త్రీనగర్ కాలనీ శ్రీ దుర్గా భవాని మాతృ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విజయదశమి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆయుధ (శస్త్ర) పూజను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు తో పాటు విశిష్ట అతిథిగా శ్రీ వినీషా లక్ష్మి కృష్ణ మోహన్,ప్రధాన వక్తగా శ్రీ వారె దస్తగిరి పాల్గొన్నారు.ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి,సాంప్రదాయాలను తెలుసుకొని ధర్మాన్ని ఆచరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈపూజా కార్యక్రమాల్లో కాలనీవాసులు సామనపల్లి రాఘువులు,తోగిటి రాజు, సిద్ద సాయన్న, మద్దెల రాజేందర్, జుమ్మిడి మల్లేష్,రవి ప్రకాష్,సింగారి రాజ్ మోహన్,పృథ్వీ రాజ్,దేవి రాజ్ కుమార్,బొమ్మెత, ప్రవీణ్,సిద్ద అఖిల్,ప్రశాంత్, విజయ్,సిద్ద రామ్ లక్ష్మ ణ్,అక్షిత్, భవాని మాల ధరించిన మాతలు,స్వాములు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

**లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అర్లీ గోడిసెరలో ని గంగ నీళ్ల జాతర ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసన్న వినోద్, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంగ నిళ్ళ జాతర ఘనంగా జరుపుకుంటామని గోదావరి నది వరకు మంగళ వాయిద్యాలతో శివసత్తులు మరియు గ్రామస్తులు భక్తులు నడుచుకుంటూ వెల్లి గోదావరి నది నీళ్లు తీసుకువచ్చి గ్రామంలోని దేవతలకు గంగాభిషేకం చేసి అభిషేకాలు అర్చనలు నిర్వహించి గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని,పాడి పంటలు,ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతునికి ప్రార్థన చేస్తారు.ఈ కార్యక్రమంలో విడీసీ సభ్యులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

**దిలావర్‌పూర్ :** ఆదెల్లి శ్రీ మహాపోచమ్మ అమ్మవారి ఆభరణాల రాకతో సాంగ్వి గ్రామంలో జనజాతర సందడి నెలకొంది. శనివారం ఉదయం సారంగాపూర్ మండలంలోని ఆడేల్లి ఆలయం నుంచి సారంగాపూర్,యాకర్‌పల్లి,వంజర్, ఫ్యారామూర్, కదిలి, మాదేగం,దిలావర్‌పూర్,బన్సపల్లి,కంజర్,మల్లాపూర్ గ్రామాల మ సాంగ్వి చేరుకున్న అమ్మవారి ఆభరణాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివచ్చారు.మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఆభరణాలను ఘన స్వాగతం పలికారు.సాంగ్విలోని అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆదివారం ఉదయం స్థానిక గోదావరిలో ఆభరణాలను శుద్ధి చేసి తిరిగి గ్రామాల మీదుగా ఆడేల్లికి తరలించారు.జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు :** సాంగ్వి గంగ పోచమ్మ జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. వృద్ధులను గోదావరి వైపు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

**సారంగాపూర్ :** శనివారం ఉదయం ప్రారంభమైన శ్రీ అడెల్లి మహా పోచమ్మ గంగ నీళ్ల మహోత్సవ జాతర ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది.వేకువ జామున దిలవార్పూర్ మండలంలోని సాంగ్వి గోదావరి తీరం నుండి బయలుదేరిన పోచమ్మ ఆభరణాల శోభాయాత్ర విశేష జనవాహిని మధ్య సాయంత్రం అడెల్లి ఆలయానికి విశేష చేరుకుంది.ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆలయ ఈవో కే భూమయ్య ఆధ్వర్యంలో ఆభరణాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.




**గ్రామ గ్రామాన నీరాజనాలు :** సాన్వి గ్రామము నుండి అడెల్లి వరకు కాలినడకన సాగే ఈ శోభాయాత్రలో మధ్య మధ్యన గల గ్రామాల్లోని భక్తులు భాజా భజంత్రీలతో, భక్తి గేయాలతో,నృత్యాలతో స్వాగతం పలుకుతూ ఎలాగైనా అమ్మవారి నగలను తాకాలని తారసపడుతూ టెంకాయలు సమర్పిస్తూ ఆభరణాలపై బంగారం(పసుపు)చల్లుతూ నీరాజనాలు పలికారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన పద్మశాలీయులు :** శ్రీ మహా పోచమ్మ గంగ నీళ్ల జాతరను పురస్కరించుకొని ఎప్పటిలాగే పద్మశాలీయులు వేకువజాము ఉదయం అమ్మవారికి తొలి పట్టు వస్త్రాలు,ఓడి బియ్యం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీయులే మొదటి పట్టు వస్త్రాలు ఓడి బియ్యం సమర్పించాలని అధికారిక ప్రకటన చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని గంగానీల జాతర కోసం 200 మంది బయలుదేరి వెళ్లారు.బోథ్ లోని పోచమ్మ అమ్మవారి నగలు తీసుకుని దేవుడు రాజేశ్వర్ వెళ్లి సాంగ్వి లోని గంగానీళ్లు తో ఆభరణాల శుద్ధి చేసి తీసుకొని వస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుత గంగానీళ్లను తీసుకొని వచ్చిన తర్వాత ఆదివారము గంగా నీటితో అమ్మవారిని అభిషేకించి ఆభరణాలతో అలంకరించి పూజిస్తారు అన్నారు. అమ్మవారికి సలి బోనాలు వేయడం ప్రారంభిస్తారు అని తెలిపారు. పాడిపంటలతో పిల్లాపాపలతో అందరు సుఖంగా బాగుండాలని అమ్మవారిని పూజించడం జరుగుతుందని తెలిపారు.
















## విశ్రాంత ఉపాధ్యాయుడు నరసయ్య అందరికీ ఆదర్శం

మాజీ ఎంపిపి సత్యనారాయణగౌడ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నాటి తరం విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పి,వారు సమాజంలో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి మార్గదర్శిగా నిలిచిన మహనీయుడు విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు జి.నరసయ్య అని నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ కొనియాడారు.ఇటీవల స్వర్గస్తులైన నరసయ్య నిర్మల్ పట్టణంలోని వివేక్ నగర్ నివాసానికి శనివారం రోజున సత్యనారాయణ గౌడ్ వెళ్లారు.అక్కడ ఆయన కుమారులు,ప్రవాస భారతీయుడు డాక్టర్ ఈశ్వర్,హరి ప్రసాద్‌లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి,నరసయ్య చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపంతో పాటు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నరసయ్య తనకు కూడా గురువని, ఆంగ్ల బోధనలో ఆయన శైలి అద్భుతమని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ చూపాలనే తపనతో ఆయన చేసిన సేవలు,బోధనా విధానం నేటి తరం ఉపాధ్యాయులకు ఎంతో ఆదర్శవంతమైనవని పేర్కొన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నరసయ్య శిష్యులు డాక్టర్ మురళీధర్ గుప్తా,విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్రావు, శ్రీధర్, వేణుగోపాల్,తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు రాష్ట్రస్థాయి కమిటీలో ఖానాపూర్ ఉపాధ్యాయులు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఇటీవల నల్గొండలో నిర్వహించిన పీఆర్టీయు తెలంగాణ రాష్ట్రస్థాయి కమిటీ ఎన్నికలలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన 4 గురు ఉపాధ్యాయులు ఎంపికై పీఆర్టీయు రాష్ట్ర కమిటీలో చోటు లభించింది.రాష్ట్ర అధ్యక్షులుగా సుంకరి భిక్షం గౌడ్,రాష్ట్ర జనరల్ సెక్రటరీ బి మధుసూదన్ రెడ్డి లు ఎంపిక కాగా ఖానాపూర్ మండలం నుంచి ఎంపికైన 4 గురు ఉపాధ్యాయులు వివరాలను పీఆర్టీయు మండల సంఘం అధ్యక్షులు డి నర్సయ్య ప్రధాన కార్యదర్శి కె ప్రవీణ్ కుమార్ లు ప్రకటించారు.పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా డి.శ్రీనివాస్ (జడ్పీహెచ్ఎస్ సుర్జాపూర్), జీఎల్వీ ప్రసాద్ (జడ్పీహెచ్ఎస్ బీర్నంది) లు ఎంపిక కాగా ఉపాధ్యక్షులుగా నరేందర్ (జడ్పీహెచ్ఎస్ మస్కాపూర్) ఎ. శ్రీలత (జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ఖానాపూర్)లు ఎంపికయ్యారు.రాష్ట్ర స్థా యి బాధ్యతలకు 4 గురు ఉపాధ్యాయులు ఎంపిక కావడం పట్ల పీఆర్టీయు ఖానాపూర్ మండల కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## నిర్మల్ దాండియా నైట్స్‌లో దాండియా ఆడిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఉధాసి మాటమ్ ఎన్టీఆర్ మార్గ్ ప్రియదర్శినినగర్ లో అన్మృత రెసొనెన్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'నిర్మల్ దాండియా నైట్స్ – 2026' కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి అప్పాల కావ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ఉత్సాహంగా దాండియా ఆడుతూ కార్యక్రమంలో సందడి చేశారు. సంప్రదాయ దాండియా నృత్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ వేడుక పండుగ వాతావరణంలో ఎంతో వైభవంగా సాగింది.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య,వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్,చక్రవర్తి నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

